క్లుప్తంగా

క్రికెట్ కిట్లు అందజేత

మెరకనపల్లి(మోపిదేవి): మెరకనపల్లిలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లును శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు శనివారం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ మట్టా అద్భుతరావు, యర్రంశెట్టి సునీల్, బలరాం, సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని పరాసుపేట ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా వెంకట నాగభవాని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం ఆమె హనుమాన్ చాలీసా పారాయణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

మజ్జిగ పంపిణీ



మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్ రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం వద్ద పాదచారులకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. మోటమర్రి శేషావతారమ్మ కుటుంబ సభ్యులు మజ్జిగను సమకూర్చారు. నగరపాలక సంస్థ వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చెప్పులు లేకుండా వెళుతున్న పాదచారులకు చెప్పులను అందజేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పర్యవేక్షించారు.

మెడికల్ కిట్లు వితరణ



అవనిగడ్డ: రేపల్లెకు చెందిన నాగార్జున నర్సింగ్ హోం నిర్వాహకులు స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్ డిపోకి 70 మెడికల్ కిట్లను అందజేశారు. స్థానిక డిపో కార్యాలయం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో వీటిని డిపో మేనేజర్ కె. హనుమంతరావుకు నర్సింగ్ హోం నిర్వాహకులు డాక్టర్ వల్లభనేని కృష్ణ చైతన్య తండ్రి వల్లభనేని బుచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ఇంజినీర్ జీవీ రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ బాలశౌరిని కలిసిన బార్ సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఇటీవల నూతనంగా ఎన్నికైన మచిలీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి కొట్టే రఘురాం, కార్యవర్గ సభ్యులు న్యాయవాదుల సమస్యలను ఎంపీ బాలశౌరికి వివరించారు. బార్ అసోసియేషన్‌లో డిజిటల్ లైబ్రరీకి పార్లమెంట్ నిధులు కేటాయిస్తానని, అందుకు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.

జగనన్న కాలనీల్లో అంతర్గత రోడ్లకు నిధులు

- రూ.6.22 కోట్ల నిధులు విడుదల
- మోడల్ కాలనీల్లో ఆర్చ్‌ల నిర్మాణానికి రూ. 21 లక్షలు విడుదల



పెడనలో జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

పెడన: పేదవాడి సొంతింటి కలను నేరవేర్చేందుకు ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్లలో అంతర్గత రహదారుల నిర్మాణానికి పెడన నియోజకవర్గ వ్యాప్తంగా రూ.6.22 కోట్ల నిధులు విడుదలయ్యాయి. వీటితో పాటు మరో ఐదు మోడల్ కాలనీల్లో కాలనీ ప్రవేశాల వద్ద ఆర్చ్‌ల నిర్మాణానికి రూ.21 లక్షలు మంజూరయ్యాయి. నిధులు రావడంతో ఆయా పనులను అప్పగించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించి టెండర్లు పిలిచి పనులు అప్పగించేలా చర్యలు చేపట్టారు. పెడన నియోజకవర్గంలోని పెడన పట్టణంతో పాటు పెడన మండలం, గూడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో వైఎస్సార్ లే అవుట్లు, సొంత స్థలాల్లో ఇప్పటి వరకు 8,267 ఇళ్లను మంజూరు చేశారు. వీటిల్లో 8,045 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిల్లో 1,969 ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి కాగా కొందరు గృహ ప్రవేశాలు చేశారు. మరికొందరు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నారు.

నియోజకవర్గంలో నిధుల విడుదల ఇలా..

పెడన నియోజకవర్గంలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి సంబంధించి పెడన పట్టణంలోని మూడు లే అవుట్లలో ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ. 1.70 కోట్లు విడుదల చేశారు. అలాగే కృత్తివెన్నులో 16 లే అవుట్లు ఉన్నా 13 లే అవుట్లలో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.1,56,44,000 మంజూరయ్యాయి. పెడన మండలానికి రూ.38.60 లక్షలు, గూడూరు మండలానికి రూ. కోటి ఐదు వేలు, బంటుమిల్లి మండలానికి రూ.1.57 కోట్లు మంజూరు చేశారు. ఇవి కాకుండా పెడన పట్టణంతో పాటు పెడన మండలం, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాల్లో ఒక్కో ఆర్చ్ నిర్మాణానికి రూ.4.20 లక్షలు మంజూరయ్యాయి. ఐదు ఆర్చ్‌ల నిర్మాణానికి రూ.21 లక్షలు మంజూరు చేశారు. త్వరలో ఆయా పనులను ప్రారంభించనున్నారు.

రహదారుల పనులు అప్పగిస్తున్నాం



పెడన నియోజకవర్గంలో లబ్ధిదారులు ఇళ్లను త్వరిత గతిన నిర్మించుకునేలా చైతన్యం చేస్తున్నాం. వేగంగా నిర్మాణాలు పూర్తయ్యేలా నిత్యం ప్రోత్సహిస్తున్నాం. అంతర్గత రహదారులు ముందుగా నిర్మిస్తే ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతాయని అనుకుంటున్నాం. ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం. లబ్ధిదారులకు ఇసుక, స్టీల్, సిమెంటు బస్తాలు అందుబాటులోనే ఉన్నాయి.

– ఎ. శ్రీనివాసరావు, డీఈ, గృహ నిర్మాణ శాఖ, పెడన నియోజకవర్గం

సంక్షేమం అమలులో దమ్మున్న సీఎం జగన్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- దిండి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

గణపేశ్వరం(నాగాయలంక): రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా సంక్షేమ లబ్ధి ఎంతమేరకు అందింది.. పథకాలు అందడంలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకునేందుకు ఎమ్మెల్యేలను గడప గడపకు పంపుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గణపేశ్వరం సచివాలయం పరిధిలోని దిండి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ గ్రామంలో 390 గృహాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సర్పంచి బెల్లంకొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, మద్ది కొండలు, పాపారావు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీమన్నారాయణుడి పవళింపు సేవ

ముగిసిన మహా కుంభాభిషేక ఉత్సవాలు



స్వామివారికి పవళింపు సేవ నిర్వహిస్తున్న భక్తులు

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో మహా కుంభాభిషేక ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం ఉదయం త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో పండితులు కల్యాణమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రత్యేక పల్లకీలో కల్యాణ మూర్తులకు ద్వాదశ ప్రదక్షిణలు కనులపండువగా నిర్వహించారు. శ్రీ పుష్పయాగ మహోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. కల్యాణమూర్తులను ప్రత్యేక ఉయ్యాలలో ఉంచి పవళింపు సేవ నిర్వహించారు. పవళింపు సేవలో పాల్గొన్న 100 మంది దంపతులకు రవిక, పసుపు,కుంకుమ, పండ్లను అందించారు. నూతనంగా ప్రారంభించిన అష్టభుజ మండపంలో స్వామివార్లకు శయ్యాదివాసాన్ని నిర్వహించారు. శనివారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాళి ప్రసాద్, జూపూడి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్, జోగి రాజీవ్

కృత్తివెన్ను: మండల పరిధి కొమాళ్లపూడి పాటిమీద గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో అభయాంజనేయస్వామి వారి విగ్రహ, శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.34 గంటలకు ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వేద పండితులు పూర్తి చేశారు. స్వామి వారిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, ఆయన తనయుడు రాజీవ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఇంటి ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది.

టెన్త్‌లో మండల టాపర్లకు సన్మానం



టెన్త్‌లో మండల టాపర్లతో ఎమ్మెల్యే సింహాద్రి

చల్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని చేసిన కృషి ఫలితంగానే ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పేద విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శనివారం స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో చల్లపల్లి, మోపిదేవి మండలాల్లోని జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మంది టాపర్లను ఎంఈఓ కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలు, మెమెంటోలను బహూకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టెన్త్ తర్వాత విద్యార్థుల జీవితం మలుపు తిరుగుతుందని, ఉజ్వల భవిష్యత్ దిశగా అడుగులు వేయించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మోపిదేవి ద్వారకానాథ్, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ మేరుగు ఝాన్సీలక్ష్మి, షేక్ నసీంఘోరీ, ఎంఈఓ కొడాలి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి భారీ ఏర్పాట్లు

కోడూరు: హనుమాన్ జయంతి వేడుకులకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లోని ఆంజనేయ స్వామి వారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వంతెన సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఆదివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పాదాలవారిపాలెం, లింగారెడ్డిపాలెం, ఉల్లిపాలెం, పిట్టల్లంక, వి.కొత్తపాలెం, జయపురం, మాచవరం గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేశారు.

- పెడన: స్థానిక రామలక్ష్మీ వీవర్స్ కాలనీలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు దేవస్థానం నుంచి హనుమాన్ శోభయాత్ర జరుగుతుందని చెప్పారు. యాత్ర అనంతరం దేవస్థానం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.
- బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలోని సువర్చల ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఉత్సవ మూర్తులకు 108 కలశాలతో అభిషేకాలను శనివారం నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు, కీర్తిప్రసండ్ శిష్య బృందం వేదమంత్రాల మధ్య నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- కృత్తివెన్ను: హనుమజ్జయంతి మహోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలోని గాంధీనగరం, నీలిపూడి, ఒంటిళ్ల తదితర గ్రామాలలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆలయాలలో ప్రత్యేక పూజలు, తమలపాకుల అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కర్రల వంతెన పనులు పరిశీలిస్తున్న పేర్ని నాని

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 22వ తేదీన మచిలీపట్నంలో పర్యటించనున్నారు. సీఎం పర్యటనకు జరుగుతున్న ఏర్పాట్లను బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించే ప్రాంతాన్ని సందర్శించారు. హెలీప్యాడ్, పైలాన్ ఏర్పాట్లను పరిశీలించి పోర్టు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సముద్ర పూజ నిమిత్తం ఏర్పాటు చేస్తున్న కర్రల వంతెనను ఎక్కి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అస్గర్, పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా సభ ఏర్పాటు పనులు..

మచిలీపట్నంటౌన్: బందరు పోర్టు నిర్మాణ పనులను ఈ నెల 22వ తేదీన ప్రారంభించేందుకు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాటు పనులు ఎమ్మెల్యే పేర్ని నాని శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానిక సర్కారుతోటలోని స్విమ్మింగ్‌పూల్ పక్కనున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థలంలో బహిరంగ సభ నిర్వహణ పనులు చేస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లో మట్టి తోలే పనులు, మెరక ప్రాంతాలను చదును చేసే పనులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న కిశోర బాలికలు

కృత్తివెన్ను: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం, ర్యాలీ శనివారం నిర్వహించామని ప్రాజెక్టు సూపర్‌వైజర్ శ్యామలాగౌరి తెలిపారు. 11 నుండి 18 సంవత్సరాల లోపు వయస్సున్న బాలికలకు వారి శరీరంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దట్టమైన పొగతో ఇక్కట్లు

ఊపిరాడక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని డంపింగ్‌యార్డు చెత్తకు మునిసిపల్ సిబ్బంది నిప్పు పెట్టడంతో వెలువడుతున్న దట్టమైన పొగతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలోని డంపింగ్ యార్డులో ప్రస్తుతం చెత్త తొలగింపు ప్రక్రియ జరుగుతోంది. ప్రతి రోజూ సేకరిస్తున్న చెత్తను గుంటూరు పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. అయితే ఇక్కడి మునిసిపల్ సిబ్బంది డంపింగ్ యార్డులో ఉన్న చెత్తకు నిప్పు పెట్టడంతో అది మండుతూ వెలువడుతున్న విష వాయువులతో కూడిన పొగ ఆ ప్రాంతాన్ని చుట్టుముడుతోంది. ఆంధ్ర జాతీయ కళాశాల వరకు పొగ వ్యాపించడంతో ఆ ప్రాంతంలో నివాసితులు పొగను పీల్చలేక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాలులతో విస్తరిస్తున్న పొగతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయాసం ఉన్న వ్యక్తుల బాధలు వర్ణనాతీతం. మునిసిపల్ సిబ్బంది అనాలోచిత నిర్ణయంతో గత రెండు రోజులుగా ఈ పరిస్థితి నెలకొనటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎంహెచ్‌ఓ వై. బాలసుబ్రహ్మణ్యంను వివరణ కోరగా మునిసిపల్ సిబ్బంది నిప్పు పెట్టరని కెమికల్ రియాక్షన్ వల్ల కూడా ఇలా జరిగి ఉండవచ్చన్నారు. మంటలు ఆర్పేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం పెంపు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న చిన్నారులు

మచిలీపట్నంటౌన్: వేసవి శిబిరాలతో విజ్ఞానం పెరుగుతుందని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటలు, పాటలు, యోగాసనాలు, పుస్తక పఠనం, కథలు, సామెతలు, డ్యాన్స్ తదితర అంశాలు నేర్పించారు. ఉపాధ్యాయిని విజయ విద్యార్థులకు భగవద్గీతలోని 12వ అధ్యాయంలో మూడో శ్లోకాన్ని నేర్పించారు. ఆ పద్యం యొక్క తాత్పర్యాన్ని వివరించారు. యోగాసనాలు వేయించారు. ఉపాధ్యాయిని వై. జయలక్ష్మీ విద్యార్థులకు క్విజ్, కథలు చెప్పించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీ పెట్టారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు. ఈడేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో చిత్రలేఖనం చేయించి జనరల్ నాలెడ్జ్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు సైకాలజీ, మెడిటేషన్ క్లాసులు నిర్వహించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బుట్టాయిపేటలోని గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో శనివారం అన్యోన్య సహిత అష్టోత్తర శత సూక్త హవము నిర్వహించారు. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి 11 వేల గారెలతో విశేషార్చన నిర్వహించనున్నారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ జీవీ సుబ్బారావు పర్యవేక్షించారు.

విస్తృతంగా కుటుంబ ఆరోగ్య సర్వే



నడకుదురు(చల్లపల్లి): జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే శనివారం నడకుదురులో నిర్వహించారు. పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి సహకారంతో నడకుదురులో సర్వే బృందం ప్రతినిధులు ప్రదీప్, కల్యాణ్, సందీప్ 300 ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ, ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు కృష్ణాజిల్లా, ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామ కాపురస్తురాలు కలపాల శ్యామ్యూల్ జాన్సన్ గారి భార్య రాజశ్రీ గారు ఇచ్చిన సంజాయిషీ ఏమనగా.

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని ది. 16-06-2009న ద.నెం. 2324/2009గా కలపాల మోహనరావు గారి ద్వారా క్రయం పొందియున్నారు.

సదరు మోహనరావు గారు ది. 7-7-2006న ద.నెం 2625/2006గా లుక్కా (లేటు) కోటయ్య గారి కుమారుడు లక్ష్మీనరసింహారావు మరియు వీరి కుమార్తు విక్రయించిన ఆస్తి లుక్కా నరసింహారావు గారి తండ్రిగారైన లుక్కాకోటయ్య గారు ది. 27-04-1938న ద.నెం. 866/1937 ద్వారా క్రయం పొందిన దర్శిలా వారి జీవిత కాలంలో సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవిస్తూ ఇంటెస్టేట్‌గా చనిపోయినారు. తదుపరి వారి డెత్ సర్టిఫికెట్ గానీ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ గాని పొందియుండలేదు. దర్శిలా వీరి కుమార్తు 1984లో మూజుబాణీగా పంచుకొనగా భాగలబ్ధముగా లుక్కా నరసింహారావు గార్కి సంక్రమించిన యీ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన వారసత్వపు హక్కులు గానీ, ఇతర ఏవిధమైన లావాదేవీలు గానీ వున్నయెడల 7 రోజులలోపు వ్రాతపూర్వకముగా తెలుపగలరు. దర్శిలా వచ్చు అభ్యంతరాలు పరిగణలోకి తీసికొనబడవు.

షెడ్యూలు: కృష్ణాజిల్లా, మచిలీపట్నం స॥రి॥ వారి యిలాకా బందరు మండలం, ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామంలోని ఆర్.ఎస్. నెం. 530/2కు చెందినదిన్నీ డోర్ నెం. 3/2కు సమీపమున గలదిన్నీ చ॥గ॥ 739ల ఖాళీ నివేశ్న స్థలంకు హద్దులు. **తూర్పు:** మారుబోయిన సుబ్బారావు గారి స్థలం, **దక్షిణం:** అ. 6 లు వెడల్పు గల జాయింటు దారి మరియు కొడాలి బాబ్జీ గారి ఇల్లు, స్థలము, **పడమర:** లుక్కా పెదనరసింహారావు గారి స్థలము, **ఉత్తరం:** అ. 16లు వెడల్పు గల జాయింటు దారి. ఈ హద్దుల మధ్య చ.గ. 739లు ఖాళీ నివేశ్న స్థలం.

గొడుగుపేట	పసుమర్తి సూర్యప్రకాష్
మచిలీపట్నం	న్యాయవాది
ది. 13-5-23	ఫోన్ : 98661 27508

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

గుడివాడ టౌన్: జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలని కృష్ణా జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆయన హౌసింగ్ అధికారులతో కలిసి మల్లాయిపాలెం లే అవుట్‌లోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం అయ్యాక గృహాలు ప్రభుత్వ నమూనాలు ప్రకారం వేస్తున్న పెయింటింగ్, వర్లి ఆర్ట్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. హౌసింగ్ డీఈఈలు రామోజీ నాయక్, నిరీక్షణరావు, ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



మంగళాపురం(చల్లపల్లి): వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

రామానగరం(చల్లపల్లి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం లక్ష్మీపురం శివారు రామానగరంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మొక్కలు నాటి పెంచాలని వారు సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దన్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత వయసు నిండిన తర్వాతే వివాహం చేయాలని వివరించారు.

బైక్ ఢీకొని విద్యార్థికి గాయాలు

కోనేరుసెంటర్: బైక్ ఢీ కొనడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన దాసి మోహన శేఖర్ 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ట్యూషన్‌కి వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా బైక్ విద్యార్థిని ఢీకొట్టింది. విద్యార్థి ఎడమ కాలు విరిగిపోయింది. స్థానికులు విద్యార్థిని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.